పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- డయేరియాపై పట్టణంలో స్పెషల్‌డ్రైవ్
- మౌలికవసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత
- అభివృద్ధి పనుల సమీక్షలో చైర్‌పర్సన్ మనూజారెడ్డి


అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులతో సమీక్షిస్తున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : ఎన్నికల కోడ్ కారణంగా పట్టణంలో నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ పనులను కాంట్రాక్టర్‌లు త్వరితగతిన పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో రోడ్లు, డ్రెయిన్లకు సంబంధించి పెండింగ్ పనులపై కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ...ఎన్నికల కోడ్‌తో మూడునెలలుగా పట్టణంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. పట్టణంలోని 35 వార్డులకు కలిపి రూ.58 కోట్ల 50లక్షల 5వేల రూపాయలకు సంబంధించి ప్రపోజ్డ్ వర్క్స్, అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ శాంక్షన్, సీఆర్ జరిగిన అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటన్నంటిని త్వరితగతిన పూర్తిచేసేలా కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులు చొరవ చూపాలన్నారు. కాంట్రాక్టర్‌లను పనులు ప్రారంభించాల్సిందిగా కోరితే, ఇసుక, సిమెంట్ సమస్యలను ప్రస్తావించడంతో కమిషనర్‌ను తహసీల్దార్‌తో మాట్లాడి అనుమతులు ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ..ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే వైఎస్సార్ సీపీ కౌన్సిల్ ప్రథమ ప్రాధాన్యత అని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. కమిషనర్ కే.ప్రమీల మాట్లాడుతూ...పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సీడీఎంఏ, మున్సిపల్ స్పెషల్ సీఎస్ సూచనల మేరకు ప్రత్యేక పారిశుధ్య పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో డయేరియా ప్రబలడంతో, పారిశుధ్య నిర్వహణలో భాగంగా జూన్1 నుంచి డయేరియా క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకు పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా బ్లాక్‌స్పాట్స్ గుర్తించడం, కాలువల్లో జేసీబీలతో పూడికలు తీయించడం, ప్రత్యేక పారిశుధ్య పనులు చేయడం జరుగుతోందన్నారు. తాగునీటి సరఫరాలో క్లోరినేషన్‌కు సంబంధించి ప్రతి 15రోజులకు ఒకసారి ఈఎల్‌ఎస్‌ఆర్ ట్యాంకులను శుభ్రపరచడమే కాకుండా డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కాచి చల్లార్చిన వేడినీటిని తాగాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ రోడ్లపై వేయకుండా, చెత్త వాహనాలకే అప్పగించాలని సూచించారు. సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారు సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏఎస్ఎం, వైద్యుల సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, మేస్త్రీ శ్రీనివాసులు, పాల్‌చంద్రశేఖర్, రేణుక, ముబీనా, షబానా, ఎల్‌ఐసీ.సుధాకర్, ఆంజనేయులు, చరణ్, డీఈ శ్రావణి, ఏఈలు బండపల్లిశిరీషా, స్నేహప్రియా తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


బాలికా విద్యపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : ఆడపిల్లను చదివిస్తే కుటుంబం బాగుపడటమే కాకుండా, సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సీఆర్‌వై సంస్థ పూరి పడాయి, దేశ్‌కీ భలాయి కార్యక్రమంలో భాగంగా పోర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కార్యక్రమానికి హాజరై బాలికా విద్యకు తనవంతు మద్దతు ప్రకటిస్తూ సంతకం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మనిషికి సిరిసంపదల్ని, సుఖసంతోషాల్ని, కీర్తిప్రతిష్టలను సంపాదించి పెట్టేది కేవలం విద్యయేనని, అలాంటి విద్యని ఆడపిల్లలకు దూరం చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. తల్లిదండ్రులు ఆడపిల్లల చదువుపై నిర్లక్ష్యం కనబరుస్తుంటారని, చదువుకు లింగభేదం లేదన్నారు. చదువు ప్రపంచ జ్ఞానాన్ని, ఆత్మజ్ఞానాన్ని పెంపొందించి సంస్కారం, విశాలమైన ఆలోచనా దృక్పథాన్ని పెంచుతుందన్నారు. తన కాళ్లమీద తను నిలబడేందుకు, తన పిల్లలకు చదువు చెప్పేందుకు, సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు ఆడపిల్లలు చదువుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆడపిల్లలే దేశ భవిష్యత్తు అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. అవకాశం ఇస్తే తమ శక్తిమేరకు పనిచేసి, అన్నిరంగాల్లో తమను తాము నిరూపించుకుంటున్నారన్నారు. బాలికా విద్యపై పోర్డ్‌సంస్థ సేవలు అభినందనీయమన్నారు. పోర్డ్ వ్యవస్థాపకురాలు జిల్లా లలితమ్మ మాట్లాడుతూ..సీఆర్‌వై సంస్థ ఆధ్వర్యంలో బాలికల చదువు 18 సంవత్సరాల వరకు కొనసాగించాలని పూరి ఫడాయి దేశ్‌కీ భలాయీ క్యాంపెయిన్ ఏడువారాల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, మాధ్యమిక, మాధ్యమికోన్నత పాఠశాలల్లో బాలికల నమోదు పెంచడం, ఆయా తరగతుల్లో వారిని కొనసాగేలా చూడటం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

సేవా గుణం అలవర్చుకోవాలి

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సాయి నారాయణ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం వృద్ధులకు, వికలాంగులకు, అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సాయంత్రం టిఫిన్, పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ సాయి నారాయణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమం మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. పెళ్లి, పుట్టిన రోజులు జరుపుకునే వారు సాయి నారాయణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుపుకుని, ఆకలితో అలమటిస్తున్న వారికి అన్నదానం, సాయంత్రం బ్రెడ్డు, పాలు అందించడం వలన ఎంతో మంది ఆకలి తీరుతుందన్నారు. నిరుపేదలకు సేవ చేయడంలో అందరూ ముందుండాలన్నారు. మనకున్నంతలో తోటి వారికి సాయం చేయడం ద్వారా జీవితానికి తగిన సార్థకత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్రమణ, ఉపసర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, నాయకులు నీళ్లభాస్కర్, సురేష్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, లక్ష్మన్న, రమణ, రెడ్డెప్ప రెడ్డి, అంజి, విశ్వనాథ్, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి, ట్రస్టు సభ్యులు, వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలో ఎలాంటి అవకతవకలు జరగలేదు

–సర్పంచ్ జీనత్‌షఫీ



పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని సర్పంచ్ జీనత్‌షఫీ అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మాట్లాడుతూ పీలేరు గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి 9 నెలల 26 దినాలు అయిందని, సక్రమంగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలో ఏదో అవకతవకలు జరిగాయని ప్రతి రోజు ప్రచురణలు జరుగుతున్నాయని, ఇది సమంజసం కాదన్నారు. మా లెక్కలు ఏ ఆడిటర్‌కైనా చూపించడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పీలేరు గ్రామ పంచాయతీకి రావలసిన ఆదాయం ఎన్నికల నిబంధనల ప్రకారం పన్నులు వసూలు కాలేదని, అయినా మేము కరెంటు సమస్య గాని, మరుగునీటి కాలువల సమస్య, నీటి సమస్య రాకుండా కార్మికుల సహకారంతో సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్మిక సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి, పెట్రోలు, ఇతర సామగ్రి కొనుటకు నెలకు రూ. 23 లక్షలు ఖర్చు అవుతోందని చెప్పారు. పాత అప్పులు దాదాపు రూ.3 కోట్లు ఉన్నాయని, పాత కాంట్రాక్టర్లకు, పని చేసిన వారికి చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా పంచాయతీలో లెక్కలు చూసుకుని నిజానిజాలు ప్రచురించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


క్లోరోస్కోపి పరికరాల కిట్‌ను అందజేస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

తంబళ్లపల్లె: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో తాగునీరు, పారిశుధ్యంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అందరూ సమన్వయంతో పని చేసి గ్రామాల్లో పర్యటించాలన్నారు. తాగునీటి సమస్య, పారిశుధ్య లోపం, వ్యాధుల బారిన పడిన వారి వివరాలు సేకరించాలన్నారు. తాగునీటిని క్లోరోస్కోపిక్ పరికరంతో నీటి స్వచ్ఛతను పరీక్షించాలన్నారు. తాగునీటి బోర్ల వద్ద మురుగునీటి కుంటలు ఉన్నా, పారిశుధ్యం లోపించినా వెంటనే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలను చైతన్యపరిచి వ్యాధుల బారిన పడిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు పొందే విధంగా చూడాలన్నారు. డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడిన వారికి వైద్య చికిత్సలు అందే విధంగా చొరవ చూపాలన్నారు. రాత్రివేళ దోమల బారిన పడకుండా దోమ తెరలు వాడటం, నీరు కాచి వడబోసి తాగే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సమేశంలో ఆర్‌డబ్ల్యుస్ ఎఈ అశోక్ పాల్గొన్నారు.

సమష్టిగా సమస్యలు పరిష్కరిద్దాం

–మండల మీట్‌లో ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీనరసమ్మ

బి.కొత్తకోట: మండలంలో నెలకొన్న సమస్యలను అధికారులతో కలిసి సమష్టిగా పరిష్కరించుకొందామని ఎంపీపీ లక్ష్మీనరసమ్మ కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధశాఖల అధికారుల ఆయా శాఖల ద్వారా చేపట్టిన పనులు, అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల గురించి వివరించారు. ఇంతవరకు జరిగిన అభివృద్ధి తెలిపారు. ఏదైనా సమస్యలను తమదృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు కోరారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణపై సర్పంచులు భీమిగాని నాగిరెడ్డి, రుక్మిణిలు అధికారులపై మండిపడ్డారు. తుమ్మనంగుట్ట, కనికలతోపు, గోళ్లపల్లె నుంచిన విద్యార్థులు అంగళ్లు, మదనపల్లె కళాశాలలకు వెళ్లాలంటే ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. బస్సులు ఆపేలా సత్యసాయిజిల్లా కదిరి డిపో అధికారులకు చెప్పమని అంటున్నారని అన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హాజరైన ఆర్టీసీ ఉద్యోగి చెప్పారు. తాగునీటి సమస్య, పప్పు ధాన్యాలపై సర్పంచు నాగిరెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ టి.అమరనాథ్, ఎంపీడీఓ నూర్జహాన్, వైస్ ఎంపీపీలు ఎస్.రాధ, ఖాదర్‌వలీ, ఎంపీటీసీలు విమలమ్మ, రామసుబ్బారెడ్డి, యల్లప్ప, గౌతమి, రమాదేవి, సర్పంచులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా


తాగునీటి సమస్యపై ఎంపీపీ రెడ్డెమ్మకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె : కోళ్లబైలు పంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని నియోజకవర్గ సీపీఐ ఇన్‌చార్జ్ తోపుకృష్ణప్ప డిమాండ్ చేశారు. సోమవారం కోళ్లబైలు పంచాయతీకి చెందిన కాలనీ వాసులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తాగునీటి సమస్యపై ధర్నా నిర్వహించారు. ఎంపీపీ రెడ్డెమ్మ, ఎంపీడీఓ భానుప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ... కోళ్లబైలు అమ్మచెరువుమిట్ట రంగనాథ పెట్రోల్‌బంక్ వెనుకవైపు ఇందిరమ్మకాలనీలో ఆరునెలలుగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలినాలి చేసుకుని జీవించే నిరుపేదలు తమ సంపాదనలో సగభాగం నీటి ట్యాంకర్ల కొనుగోలుకే వెచ్చించడం జరుగుతోందన్నారు. వర్షాలు పుష్కలంగా పడుతున్నప్పటికీ, ప్రజావసరాలకు సరిపడా నీటిని సరఫరా చేయడంలో మండల అధికారులు నిర్లక్ష్యం కనబరుస్తున్నారన్నారు. కోళ్లబైలు ఇందిరమ్మకాలనీలో కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, రోడ్లు, కాలువలు, వీధిదీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పిల్లలను బడికి పంపేందుకు ఆటోలు రాలేని దుస్థితి కాలనీలో నెలకుందన్నారు. మండల అధికారులు కోళ్లబైలు ప్రజాసమస్యల పరిష్కారం దిశగా తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు, ఏపీ వ్యవసాయ కార్మికసంఘం నియోజకవర్గ నాయకులు చంద్రశేఖర్, సాంబశివ, మురళీ, కాలనీవాసులు షబానా, శారదమ్మ, షకీలా, రాజి, గంగులమ్మ, నౌషియ, రవి,రమణ, వెంకటరమణ పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి అభినందనలు


ఎంపీ మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

పీలేరు : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఢిల్లీలో ఎంపీని కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మూడోసారి ఎంపీగా గెలుపొందడం తోపాటు అత్యధిక మెజారిటీ సాధించినందుకు వైఎస్సార్‌సీపీ యువ నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, భీరేంద్రవర్మ, బి.వి.ఆర్. చౌదరి, శ్రీనురాజు, రాహుల్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను వినియోగించుకోవాలి

– ఆర్డీఓ హరిప్రసాద్


ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లోని ఆర్డీఓ చాంబర్, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ హరిప్రసాద్ మాట్లాడుతూ...ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం డివిజన్‌లోని ఆర్డీఓ కార్యాలయం, మండలాల్లోని రెవెన్యూ, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరుగుతుందని, ప్రజలు వారి సమస్యలపై ఆయా కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇవ్వొచ్చని తెలిపారు. అర్జీల పరిష్కారానికి నిర్ణీత కాలవ్యవధి ఉంటుందని, నిర్దేశిత సమయంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రిలయన్స్ మార్కెట్ సంస్థ వ్యర్థాలను రోడ్డుపై పడవేస్తుండటంతో దుర్వాసన వస్తోందని, దీనిపై వారికి చెప్పినా, పట్టించుకోవడం లేదని స్థానికుడైన ఎమ్.నూర్ ఫిర్యాదుచేశారు. రవీంద్రనాథ్ కాలనీ విష్ణునగర్‌లో నీళ్లు ఆరునెలలుగా రావడం లేదని, పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉండటంతో పాములు ఇళ్లలో దూరుతున్నాయని ఫిర్యాదుచేశారు. వారపుసంత నీటిట్యాంకు చుట్టుపక్కల శుభ్రపరచాల్సిందిగా నక్కాచంద్రా కోరారు.

అమెరికా విద్యా విధానం అమల్లోకి తేవాలి

–మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి


: సభలో మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి

బి.కొత్తకోట: రాష్ట్రంలో అమెరికా విద్యా విధానం అమల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అభిప్రాయపడ్డారు. లేదంటే ప్రభుత్వ బడుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె హైస్కూల్ హెడ్‌మాస్టార్ దుగ్గరాజు కాంతారావు ఉద్యోగ విరమణ సభ జరిగింది. దీనికి హాజరైన కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ అమెరికాలో అధ్యక్షుని కుటుంబమైనా, ధనికులైనా, పేదలైనా వారి స్వస్థలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలన్న నిబంధన ఉందని, దీనివల్ల ఎక్కడివారు అక్కడి పాఠశాలల్లో విద్యనభ్యసిస్తారన్నారు. దీనివల్ల ప్రభుత్వ బడులు బలోపేతం అయినట్లు చెప్పారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాలల్లో చదవాల్సిన విద్యార్థులు స్వస్థలాలను వదిలి దూరంగా ఉన్నా ప్రైవేటు పాఠశాల్లో చేరుతున్న కారణంగా ప్రభుత్వ పాఠశాలలు ఖాళీ అయ్యి మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మదనపల్లె డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మాటలను విద్యార్థులు పాటిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గోళ్లపల్లె హైస్కూల్‌కు అదనపు తరగతి గదులు మంజూరు అయ్యి, నిర్మించేదాక పట్టువదలకుండా హెచ్‌ఎం కాంతారావు కృషి చేయడం వల్లే అభివృద్ధి జరిగిందన్నారు. అంకితభావంతో పనిచేస్తే మంచి ఫలితాలొస్తాయన్నారు. అనంతరం కాంతారావు దంపతులను సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఆర్.రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారీ, శ్రీనివాసులు, త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, రామకృష్ణ, నారాయణ, సుబ్రమణ్యం, హెచ్ఎంల సంఘం అధ్యక్షులు రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యాయ సంఘ నేతలు గంటా మోహన్, అశోక్‌కుమార్, సర్పంచు రుక్మిణి, హెచ్‌ఎం శ్రీరాములు పాల్గొన్నారు.

పీలేరులో మహబూబ్ సుబహాని ఉరుసు

పీలేరు రూరల్ : స్థానిక జెండామాను వద్ద హజరత్ మహబూబ్ సుబహానివారి 78వ ఉరుసు ఉత్సవం సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా జెండామాను మినారు వద్ద పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరణ, చదివింపులు చేపట్టారు. సోమవారం గంధం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఉరుసులో భాగంగా మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు ప్రముఖ ఖవ్వాలీలచే పాటకచ్చేరి నిర్వహించనున్నారు.

ప్రత్యేక హోదా ఉద్యమాన్ని తీవ్రం చేస్తాం


ఐక్యత చాటుతున్న ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నాయకులు

మదనపల్లె సిటీ: రాష్ట్రంలోని అన్ని ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలు, న్యాయవాదులు, ఉన్నత మేధావి వర్గాలను కలుపుకుని మరొకసారి ప్రత్యేక హోదా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రియాదవ్ అన్నారు. సోమవారం స్థానిక విశ్వహిత డిగ్రీ కాలేజీలో జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విభజన హామీ చట్టాలను అమలు పరిచేలా ఉద్యమాలు చేస్తామన్నారు. రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, పరిశ్రమలు స్థాపించాలని డిమాండ్ చూస్తూ ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కమిటలు పూర్తి చేసి కార్యాచరణ అజెండాను కూడా ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలోఏపీ స్టూడెంట్స్ జేఏసీరాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఉత్తన్న ,తిరుపతి జిల్లా అధ్యక్షులు శ్రీధర్, గణేష్, నారాయణ, ప్రదీప్, పురుషోత్తం, మల్లికార్జున పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులుగా గంగారాజును నియమిస్తున్నట్లు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నిమ్మనపల్లె : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో అధికారులతో అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖలవారీగా అధికారులను పిలిచి గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మురుగునీటి కాలువలు, రోడ్లు, వీధిదీపాలు తదితర సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు గ్రామాల వారీగా సిద్ధం చేయాలని సూచించారు. అర్హులైన రైతులకు పాసుపుస్తకాల మంజూరు, భూముల ఆన్‌లైన్ సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని, రైతులను నిర్లక్ష్యం చేయవద్దని, వారికి సముచిత గౌరవం ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఇంటి నిర్మాణ అవసరాలకు స్థానికంగా ఇసుకను తహసీల్దార్ అనుమతితో తోలుకోవచ్చని తెలిపారు. సచివాలయాలకు వచ్చే ప్రజలతో బాధ్యతగా వ్యవహరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. నిమ్మనపల్లెలో లైబ్రరీ ఏర్పాటు, అగ్రహారం పంచాయతీ మంచి గుంటపల్లెకు దారిసమస్య పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, తహసీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీఓ షాలెట్, టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, మల్లప్ప, సుధాకర, శ్రీపతి, జగదీష్, యరప్పగారిపల్లె లక్ష్మన్న, శ్రీనివాసులు, రమణ, సుధాకర రావు, మల్లికార్జున, మాజీ సర్పంచ్ రమణ, చిన బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

రామసముద్రం: మండలంలోని మినికి బండపై వెలసిన శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం వైభవంగా స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి కలశారాధన, హోమం, బలిహరణ, మహా మంగళహారతి, వాహనసేవ, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు , కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రక్తదానం

పెద్దతిప్పసముద్రం: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగేశ్వర్‌రెడ్డి అనే రోగికి రక్తం అత్యవసరమైంది. సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యుడు సత్యనారాయణరెడ్డి సోమవారం ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి


డయేరియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: డయేరియా (అతిసార వ్యాధి)పై అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ డయేరియాపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా పరిసరాలు పరిశుభ్రంగా లేకపోయినా, మురుగు కాలువల్లో నిల్వ ఉండే నీటిలో దోమలు ప్రబలి, కలుషిత నీరు, ఫుడ్‌పాయిజన్ లాంటి కారణాలతో వాంతులు, విరేచనాలకు దారి తీస్తాయన్నారు. ఇందుకు తగ్గట్టు అధికారులు, వైద్య సిబ్బంది గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఈవోఆర్డీ యోగానంద్, డాక్టర్లు పురుషోత్తం నాయక్, శంకర్, యస్దానీ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వారపు సంత రోజుల మార్పు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట, ఎంపీపల్లె గుండ్రేవారిపల్లెలో జరిగే వారపు సంత రోజుల్లో మార్పు చేసినట్లు ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ సిగ్బతుల్లా సోమవారం తెలిపారు. జూలై నుంచి వారసంతల రోజుల్లో మార్పు ఉంటుందని చెప్పారు. గర్నిమిట్టలో ప్రతి ఆదివారం జరుగుతున్న వారపు సంతను ప్రతి గురువారానికి మార్చినట్లు తెలిపారు. అలాగే గుండ్రేవారిపల్లెలో ప్రతి గురువారం జరిగే వారపు సంతను ప్రతి ఆదివారానికి మార్చుతూ ఆయా గ్రామ పంచాయతీల్లో ఆమోదించినట్లు తెలిపారు. ప్రజలు, వ్యాపారులు వారపు సంతల మార్పును గమనించాలని కోరారు.

సీఆర్‌పీల ఎంపికకు రాతపరీక్ష

తంబళ్లపల్లె: ఎస్ఆర్ఎల్ఎం, సెర్ప్ ఆధ్వర్యంలో వ్యవసాయేతర జీవనోపాధుల కల్పనకు ఉప పథకాల అమలు చేసేందుకు సీఆర్‌పీలను ఎంపిక చేసేందుకు సోమవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో డీపీఎం రూతూ పర్యవేక్షణలో రాత పరీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట, కురబలకోట మండలాల నుంచి 70 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలో అర్హత సాధించిన వారిని 4 గ్రామ పంచాయతీలకు ఒక సీఆర్‌పీని నియమించనున్నట్లు డీపీఎం తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి


చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న దృశ్య

కేవీపల్లె : గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ సిగ్బతుల్లా అన్నారు. సోమవారం గర్నిమిట్ట గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళలకు చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటిలోని చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలను ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. చెత్తాచెదారం పంచాయతీ నుంచి వచ్చే చెత్తసేకరణ వాహనాల్లో వేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు చిరుకానుక


డీవైఈఓ పురుషోత్తంకు ఫొటోను అందజేస్తున్న ఉపాధ్యాయుడు చంద్రశేఖర్

మదనపల్లె సిటీ: బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నామా చంద్రశేఖర్ సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు మత సామరస్యం తెలియజేసే ఫొటోను హెచ్‌ఎం సుబ్బారెడ్డికి అందజేశారు. తన కుమారుడు ధీరజ్ 8 నుంచి 10 వరకు చదువుకున్నందుకు చిరుకానుక అందజేసినట్లు తెలిపారు. అలాగే ఎంఆర్‌సిలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీవైఈఓ కార్యాలయంలో డీవైఈఓ శ్రీరాం పురుషోత్తంకు ఫొటోలను అందజేశారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

బి.కొత్తకోట: వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ నూర్జహాన్ ఆదేశించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. మురికినీటి కాలువల్లో పూడిక తీయించి పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని కోరారు.

పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలి

పెద్దమండ్యం: గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్‌డీ శ్రీధర్‌రావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పల్లెల్లో పారిశుద్ధ్యలోపం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

కోటకొండ గంగమ్మ జాతర చాటింపు

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని వారపు సంతలో వెలసిన శ్రీ కోటకొండ గంగమ్మ జాతర నిర్వహణపై సోమవారం చాటింపు వేశారు. పూజారి శ్రీనివాసులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పోతులరాజు నృత్య విన్యాసాలతో పురవీధుల్లో ఊరేగింపు చేశారు. బుధవారం రాత్రి, గురువారం ఉదయం రెండు రోజుల పాటు జాతర నిర్వహిస్తారు.